
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 12 మే 2025





ఉష్ణోగ్రత
గరిష్ఠం 42.2
కనిష్ఠం 22.6

విద్యుత్ కోతలతో జనం ఇక్కట్లు

- మరమ్మతుల పేరుతో నిత్యం అంతరాయం
- ఉక్కపోతతో ప్రజల ఉక్కిరిబిక్కిరి
- అధికారుల తీరుపై తీవ్ర అసహనం

8

కల్యాణం.. కమనీయం



కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలోని వేదాద్రి గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనర్సింహా దేవాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆదివారం స్వామివారి జయంతి సందర్భంగా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో సీఎల్ శ్రీనివాస్ యాదవ్, ముజుబుర్ రహెమాన్, అర్చకులు నర్సింహా శర్మ, శ్రీనివాస మూర్తి, ప్రముఖ వేద పండితుడు మురళీధర శర్మ, వెంకట్ రెడ్డి, అశోక్, రవీందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నర్సింహా, మురళీశర్మ పాల్గొన్నారు.

- తలకొండపల్లి, మే11(ఆంధ్రజ్యోతి)

కల్లాలు లేక కష్టాలు



నజ్దిక్‌సింగారంలో రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకునేందుకు కల్లాలు అందుబాటులో లేక రహదారులను ఆశ్రయిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కల్లాలు నిర్మించేందుకు అవకాశం కల్పించినా నిబంధనలు అడ్డుగా మారడంతో రైతులెవరూ ముందుకు రాలేదు. దీంతో రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. యాచారం మండలం నజ్దిక్ సింగారంలో ఇలా రోడ్డుపై ధాన్యం ఆరబోశారు.

- యాచారం, మే 11(ఆంధ్రజ్యోతి)

త్వరలో ఆలయ సుందరీకరణ పనులు

పురావస్తు శాఖ పరిశోధకులు శివనాగిరెడ్డి



ఆలయంలో శివనాగిరెడ్డి

కందుకూరు, మే11(ఆంధ్రజ్యోతి) మండలంలోని లేమూరు గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయ(మన్యంభావి) సుందరీకరణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు పురావస్తు శాఖ పరిశోధకులు స్తపతి శివనాగిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయం చైర్మన్ గూడూరు కొండారెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేవాలయాన్ని ఆగమ, శిల్పశాస్త్రాల ప్రకారం తీర్చిదిద్దటానికి అవసరమైన ప్లాన్‌ను తయారు చేయడానికి కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆలయ రూపురేఖలను మార్చటంతో పాటు మండపం, ధ్వజస్తంభం, బలిపీఠం, రాజగోపురం, కోనేరులను కొత్తగా నిర్మించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. చిన్న ఆలయం ముందు రాజగోపురాన్ని జోడించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శివనాగిరెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డిల్లీ బాలకృష్ణ, మాజీ సర్పంచ్ డిల్లీ గణేష్, ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కె. భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి ప్రయోజనకరం

సాగు మెలకువలు వివరించిన ఏవో రవినాథ్ 7

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. 11వ విడతలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. వానలు కురవడమే ఆలస్యం.. మొక్కలు నాటేందుకు డీఆర్‌డీవీ, అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్టు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, కళాశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ప్రజలకు, రైతులు అడిగిన మొక్కలను ఇవ్వడానికి రెడీగా ఉన్నారు.



నందిగామలోని నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

టార్గెట్ 41.72 లక్షలు



వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం

రంగారెడ్డి అర్బన్/ చేవెళ్ల, మే 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. గత ప్రభుత్వం తెలంగాణ హరితహారం పేరుతో తొమ్మిది విడతలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదో విడతలో వనమహోత్సం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ సారి 11 విడతలో వన మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యతో జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో జూలై మొదటి వారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. జిల్లాలో 21 గ్రామీణ మండలాల్లోని

మిగతా 8వ పేజీలో...

పకడ్బందీగా చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక

వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు

డీఆర్‌డీఏ, అటవీ శాఖలకు బాధ్యతలు

టేకు, మల్బరీ, వేప, వెదురు, మునగ మొక్కలు నాటడంపై దృష్టి

పండ్లు, నీడనిచ్చే మొక్కలకు ప్రాధాన్యం



పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను ఇంటింటికీ అందిస్తాం. వీటితో పాటు మల్బరీ, టేకు, వెదురు, మునగ మొక్కలు పంపిణీ చేయాలనుకుంటున్నాం. హార్టికల్చర్ శాఖ నుంచి రైతులకు ఉపయోగపడే మొక్కలను ఇస్తాం. ఇప్పటికే రైతులను గుర్తించాం. నర్సరీల్లో మొక్కలు సిద్ధమవుతున్నాయి. వర్షాలు కురవగానే వనమహోత్సవం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. 41.72 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం

- శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వెంకమ్మగూడలోని ఓ ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ, మే 11(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, వారికోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం నందిగామ మండలంలోని వెంకమ్మగూడలో నూతన రేషన్ దుకాణాన్ని స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం వెంకమ్మగూడ గ్రామానికి చెందిన దళితుడు నర్సింహ్మ ఇంట్లో స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకమ్మగూడ వాసులు రేషన్ కోసం చేగుర్ వెళ్లే వారని, వారి కోరిక మేరకే గ్రామంలోనే దుకాణం ఏర్పాటు చేశామన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరలోనే అర్హులైన ప్రతిఒక్కరికీ వస్తాయని తెలిపారు. గత ప్రభుత్వంలో వెంకమ్మగూడ, చేగుర్ గ్రామాలకు కనీసం రోడ్డు కూడా వేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత షాద్‌నగర్ నుంచి బుగ్గోనిగూడ వరకు రూ.20 కోట్లతో బీటీ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నందిగామ మండల పరిధిలోని చేగూర్‌లో శంషాబాద్ లిమ్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. ప్రైవేట్ సంస్థలు పేదలకు సేవచేయడానికి ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో మారుమూల ప్రాంతాల్లో మీ సేవలు కొనసాగించాలని ఆసుపత్రి యాజమాన్యానికి ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీపీ, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింహులు, మంకాల శ్రీశైలం, పసుల బుచ్చయ్య, కొమ్ము క్రిష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, సాములయ్య, వీరేందర్, బుయ్యని రజనిత, సి. నర్సింహులు, వడ్డె శ్రీను, మీసేవ నర్సింహులు, ఆవుల శివ, రాజశేఖర్, సాలయ్య డాక్టర్లు రామరాజు, సుధీర్‌రెడ్డి, విశ్వనాథ్, శంకర్‌రెడ్డి, శ్వేత, నిషిత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల కేంద్రాన్ని పునరుద్ధరించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



కూల్చివేసిన చేపల పిల్లల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద కూల్చిన చేపల పిల్లల కేంద్రాన్ని తిరిగి పునరుద్ధరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకార సంఘాలతో చర్చించకుండా ఇక్కడ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఉన్న 9 ట్యాంకులను ఎందుకు కూల్చాల్సి వచ్చిందో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 32 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. ప్రతి యేటా రూ.400 కోట్ల విలువచేసే చేప పిల్లలను ఆంధ్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. వెంటనే సిబ్బందిని నియమించి చేపపిల్లల కేంద్రాల్లో ఉత్పత్తిని ప్రారంభించాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. అంతేగాక మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని సీఎంకు లేఖ రాయనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 15న సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు నిర్వహించే మహా ధర్నాకు సీపీఎం మద్దతునిస్తున్నట్లు ఆయన చెప్పారు. మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు జి.నర్సింహ, జిల్లా అధ్యక్షుడు శంకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, సామేల్, జగన్, జంగయ్య, బుగ్గరాములు పాల్గొన్నారు.



కారులో మంటలు

తప్పిన పెనుముప్పు

శంషాబాద్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగిన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం శంషాబాద్ నుంచి తొండుపల్లికి వెళ్తున్న కారులో రైల్వే బ్రిడ్జి దగ్గర మంటలు వచ్చాయి. కారు డ్రైవర్ హుస్సేన్ ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేశారు. అప్పటికే కారు దాదాపు దగ్ధమైంది. కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. మంటలు రాగానే అతను అప్రమత్తం కావడంతో ముప్పు తప్పింది.

మహర్దశ!

పోమాల్‌పల్లి- కొండారెడ్డిపల్లి చెరువు ఆధునికీకరణ..

నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి హామీ

రూ.4 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు



చెరువు కట్టపై పిచ్చి మొక్కలు

కేశంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలంలోని పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి గ్రామాల నోటిఫైడ్ చెరువుకు మహర్దశ పట్టనుంది. చెరువు అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. పోమాల్‌పల్లి - కొండారెడ్డిపల్లి గ్రామాల మధ్య నోటిఫైడ్ చెరువు 60 ఎకరాలలో విస్తరించి ఉంది. చెరువుకు దాదాపు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. పరోక్షంగా మరో 500 ఎకరాల పంటలకు నీరు అందుతుంది. ఈ చెరువు పూర్తిస్థాయిలో నిండితే కాకునూర్, తొమ్మిదిరేకుల, లింగంధన, చిన్నరేవెల్లి, పెద్ద రేవెల్లి ప్రాంతాలలో బోర్లలో భూగర్భజలం పెరుగుతుంది. ఈ ప్రాంతంలోని రైతులు అధికంగా బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. అంతేకాకుండా ఈ చెరువు పెద్దదిగా కావడంతో మత్స్యకారులకూ ఉపాధి లభిస్తుంది. టన్నుల కొద్దీ చేపలు అమ్ముకుని మత్స్యకారులు వారి కుటుంబాలకు పోషించుకుంటున్నారు. చెరువును అభివృద్ధి చేస్తే నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంటుంది. అయితే చాలాకాలంగా చెరువు నిర్వహణను పట్టించుకోక పోవడంతో పూడికతో నిండిపోయింది. వరదలు వచ్చినప్పుడు చెరువులోకి మట్టి వచ్చి చేరింది. పూడిక పెరిగిపోయి చెరువు కుచించుకుపోయింది. అంతేకాకుండా చెరువు కట్టపై పిచ్చిమొక్కలు, కంప చెట్లు విపరీతంగా పెరిగాయి. అలాగే చెరువు కట్ట నెర్రలు చాచింది. ఇలాగే వదిలేస్తే వర్షాకాలంలో చెరువుకు గండి పడి నీరు వృథాగా పోయే అవకాశం ఉంది. అలా జరగకుండా ఉండాలంటే తూములను, అలుగును పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది.



పోమాల్‌పల్లి- కొండారెడ్డిపల్లి చెరువు

చెరువును సందర్శించిన ఎమ్మెల్యే

గత సెప్టెంబరు నెలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెరువును సందర్శించారు. చెరువు నిండటంతో గంగమ్మ తల్లికి పూజలు చేశారు. నీరు వృథాగా పోకుండా చెరువును అభివృద్ధి

మిగతా 8వ పేజీలో...



క్రీడలకు ప్రోత్సాహం అభినందనీయం


రెడ్డిపల్లి జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనేక రంగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు వారాంతాల్లో మొయినాబాద్ వైపు వచ్చి క్రీడలు ఆడుతున్నారని, క్రికెట్ మైదానాలకు మొయినాబాద్ ప్రత్యేక గుర్తింపు ఉందని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. అలాగే గ్రామాల్లోని క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. మొయినాబాద్ పరిధి అజీజ్‌నగర్‌లో 10 రోజులుగా పట్లోళ్ల వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు చెన్నారెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో అజీజ్‌నగర్, రెడ్డిపల్లి జట్లు హోరాహోరిగా తలపడగా రెడ్డిపల్లి నిలిచింది. కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్ గెలుపొందిన జట్టుకు బహుమతి ప్రదానం చేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామీణ క్రీడకారుల్లో మరింత నైపుణ్యం పెరుగుతుందని చెప్పారు. నగరంలో ఉండే వారు వారాంతాల్లో మొయినాబాద్‌వైపు రావడానికి గల ముఖ్యకారణం ఇక్కడ ఎక్కువ మైదనాలు ఉండడమేనని, ఇది స్థానిక క్రీడాకారులకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్, చెన్నరెడ్డి, బిందురెడ్డి, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్తా చాటిన వీఎస్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

తాండూరు, మే 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం సర్వ కళాకారుల వేదిక నిర్వహించిన వందే జనని భారతి-సంగీత నృత్య నీరాజనం కార్యక్రమంలో తాండూరు వీఎస్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు పాల్గొన్నారు. మాస్టర్ వెంకటేష్ శిక్షణలో 'ఓ సైనికా' అనే పాత్ర ద్వారా బాలలు అద్భుత ప్రదర్శనను అందించి ఆహూతుల ప్రశంసలు పొందారు. ప్రదర్శనలో సత్తాచాటిన వీఎస్ డ్యాన్స్ అకాడమీ కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.


ఉత్తమ ప్రదర్శన చేసిన వీఎస్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

చేవెళ్ల, మే 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిల్లా అధ్యక్షుడు రామస్వామి అన్నారు. దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన చేవెళ్లలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తర్వాత కార్మికులపై దాడి మొదలు పెట్టారని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను పెట్టుబడి దారి వర్గానికి కొమ్ముకాస్తూ 4 కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి అన్యాయం చేసిందన్నారు. 8గంటల పని దినాలను సాధించుకున్న కార్మికులు కేంద్ర ప్రభుత్వం 12గంటల పని దినాలను తీసుకువస్తున్నారని అన్నారు. ప్రతి కార్మికుడికి రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభులింగం, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సుధాకర్‌గౌడ్, శివ, శివయ్య, కృష్ణగౌడ్, శ్రీనివాస్, మంజుల, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు

షాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): మైనరును గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదయింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలానికి చెందిన ఓ బాలిక అనారోగ్యంతో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక ఎనిమిది నెలల గర్భవతి అని నిర్ధారించారు. తల్లిదండ్రులు నిలదీయడంతో ఇంటి పక్కనే ఉండే వరుసకు బాబాయి అయ్యే వ్యక్తి తనను గర్భవతిని చేశాడని బాలిక చెప్పింది. కాగా ఆ యువకుడికి అప్పటికే పెళ్లయింది. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు.

ఫాంహౌస్‌పై ఎక్సైజ్ పోలీసుల దాడి

● రూ.4లక్షల విలువైన మద్యం పట్టివేత



మొయినాబాద్, మే, 11 (ఆంధ్రజ్యోతి): ఓ ఫాంహౌస్‌పై ఎక్సైజ్ పోలీసులు దాడిచేసి రూ.4లక్షల విలువ చేసే ఢిల్లీ, గోవా రాష్ట్రాల నాన్ డ్యూటీ పేయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం తోలుకట్టలో హైదరాబాద్‌కు చెందిన తేజారెడ్డి ఫాంహౌస్‌లో శనివారం ఫంక్షన్ నిర్వహించారు. ఫంక్షన్‌లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగించారు. శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అర్ధరాత్రి ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఢిల్లీకి చెందిన 50 బ్లాక్‌లేబుల్ బాటిల్లు, గోవాకు చెందిన 7లిక్కర్ బాటిల్లు, 12బీరు బాటిల్లు, తెలంగాణకు చెందిన 3 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఫంక్షన్‌లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగిస్తున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

బీజేపీ బలోపేతానికి పని చేయాలి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న శోభ, రాములు దంపతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు

యాచారం, మే 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో బీజేపీని తిరుగులేని శక్తిగా మార్చడం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లవెల్లికి చెందిన మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ నాయకులు జిల్ల శోభ, రాములు దంపతులు, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలకు కిషన్‌రెడ్డి శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని నాయకులను ఆదేశించారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆదరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ జాతర



మేడ్చల్ టౌన్, మే11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి పూడూరు కట్టమైసమ్మ ఆలయ జాతరను ఆదివారం నిర్వహించారు. భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించుకున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 15వ తేదీవరకు కొనసాగుతాయిని నిర్వాహకులు తెలిపారు.





పేదలను ఆదుకోవడమే ధ్యేయం


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, మే 11(ఆంధ్రజ్యోతి): ఆపదలో పేదలను ఆదుకోవడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని వజ్రేశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌కు చెందిన తలగాము గోపాల్‌కు రూ.32,500, బాబాగూడకు చెందిన దాసరి బలవంతరెడ్డికి రూ.43వేలు మంజూరైనట్లు తెలిపారు. చెక్కులను మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, హరికృష్ణ, బాణాల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చౌడాపూర్: మండల కేంద్రంలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అందజేశారు. చౌడాపూర్‌నకు చెందిన నాగమణికి రూ.1.2లక్షలు, నిఖితకు రూ.24 వేల విలువ గల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, రాము, యాదయ్య, యాదయ్య, రషీద్, కృష్ణయ్య, చిన్నయ్య, రమేశ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు


రోడ్డు మూలమలుపులో ఉన్న చెట్లు

చౌడాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి మక్తవెంకటాపూర్ గ్రామాలకు మధ్య రోడ్డు మూల మలుపు ప్రమాదకరంగా మారింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు పక్కన చెట్లు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పంట పొలాలకు
స్వచ్ఛందంగా రోడ్డేసుకున్న రైతులు


సిరిపూరంలో పొలాల కోసం రైతులు వేసుకున్న మట్టి రోడ్డు

మర్పల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాలకులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా మట్టి రోడ్డును వేసుకున్నారు. మండలంలోని సిరిపూరంలో దాదాపు వంద మంది రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోలేదు. పంటలు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడేదన్నారు. రైతులు ఏకమై డబ్బులు పోగు చేసి దాదాపు రూ.లక్షతో మట్టి రోడ్డును వేసుకున్నారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో తామే స్వచ్ఛందంగా రోడ్డును వేసుకున్నామని రైతులు తెలిపారు.

వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన


పెండ్లిమడుగులో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

వికారాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లిమడుగులో శని, ఆదివారాల్లో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. యజ్ఞాలు, హోమాలు ఘనంగా చేశారు. అనంతరం బొడ్రాయిలో నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూర్తి ధార్మికతతో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నదానం నిర్వహించగా సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, భోజిరెడ్డి, జంగం నాగేశం, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆమనగల్లు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీలోని గంగాభవానీ కాలనీలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం పదో వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎంగలి బాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు, భజనలు నిర్వహించారు. హోమం, పూజల్లో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల హనుమ నామ స్మరణతో గంగాభవాని కాలనీ మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, కార్యవర్గ సభ్యులు పరమేశ్, సుధాకర్, అప్పి, లింగం, ఈశ్వరయ్య, యాదగిరి, లింగప్ప, అశోక్, తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయ స్వామి పూజల్లో పాల్గొన్న నాయకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

పరిగి, మే 11 (ఆంధ్రజ్యోతి):క్రీడల్లో గెలుపోటములు సహజమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలో 40 రోజులుగా కొనసాగుతున్న పరిగి ప్రీమియర్ లీగ్(పీపీఎల్) క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పరిగిలో ఇంత పెద్దస్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. గతంలోనే తాను మినీ స్టేడియంలో వాకింగ్ ట్రాక్, లైట్లు ఏర్పాటు చేశానని తెలిపారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, ఎంఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, కులకచర్ల చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు శ్రీనివాస్, ఎ.గోపాల్ పాల్గొన్నారు. అంతకుముందు విజేతలకు నగదు, జ్ఞాపికలను అందజేశారు.


క్రికెట్ పోటీల్లో విన్నర్ జట్టుతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి





ఆటవిడుపు కేంద్రాలు..

వేసవి శిక్షణ శిబిరాలు

చిత్రలేఖనం, యోగ, ధ్యానాల్లో విద్యార్థుల సాధన .. సెలవుల సద్వినియోగం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

కేశంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యార్థుల సమయం వృథా కాకుండా విద్యాశాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. వీటిల్లో విద్యార్థులకు ఆటా-పాటలు, వ్యాయామం, యోగా, ధ్యానం, డ్రాయింగ్ వంటివి నేర్పుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రమోట్‌లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు స్థానిక పాఠశాలల్లోనే వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. యోగా, ధ్యానం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, చదరంగం, ఇండోర్ గేమ్స్, టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) తయారీ, ఆటలు, కర్రసాము, అభినయ గీతాలు, పుస్తక పఠనం, గణిత మెలకువలు, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య అలవాట్లు, అందమైన చేతిరాత, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివి నేర్పుతున్నారు. మండలంలో కొత్తపేట, కేశంపేట, పాపిరెడ్డిగూడ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఈ నెల 5న శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 నుంచి 11గంటల వరకు శిబిరం కొనసాగుతుంది. శిబిరంలో విద్యార్థులకు స్నాక్స్, తాగునీరు ఇస్తున్నారు. ఈ మూడు శిక్షణ కేంద్రాల్లో 180 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ నెల 19 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

డ్రాయింగ్ ఎలా వేయాలో నేర్పించారు



ఈ ట్రైనింగ్ క్యాంప్‌లో మాకు డ్రాయింగ్ ఎలా వేయాలో నేర్పించారు. టెన్త్‌లో డ్రాయింగ్‌లు ఎక్కువగా వేయాల్సి ఉంటుంది. ఈ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం నేను 9వ తరగతి పూర్తి చేసి పదో తరగతికి వెళ్తున్నా. శిబిరంలో చేతి రాతపై అవగాహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

- సంజన, విద్యార్థిని, పాపిరెడ్డిగూడ

యోగ, ధ్యానం నేర్పిస్తున్నారు



వేసవి శిక్షణ శిబిరంలో యోగ, ధ్యానంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పిస్తున్నారు. వేసవిలో సమయం వృథా కాకుండా ప్రభుత్వం శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం బాగుంది. మా ఊరిలోనే శిక్షణ ఇస్తున్నారు. అందంగా రాయడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. ఈ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఉదయం మాకు స్నాక్స్ కూడా ఇస్తున్నారు.

- అవంతిక, విద్యార్థిని, పాపిరెడ్డిగూడ

విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు



పాపిరెడ్డిగూడలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉదయం 8 గంటలకే శిబిరానికి వస్తున్నారు. వారి సౌకర్యం కోసం స్నాక్స్, తాగునీరు అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సైతం శిక్షణ శిబిరానికి వస్తున్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్‌ఇంగ్లిష్ వంటివి నేర్పిస్తున్నాం. ఇవన్నీ వారికి ఉపయోగపడేవే.

మల్లేశ్, సీఆర్పీ, పాపిరెడ్డిగూడ క్లస్టర్

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన చీఫ్ విప్

తాండూరు, మే 11(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఏఎస్‌జీఎంకే ట్రస్ట్ చైర్మన్ ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు వైద్య, కంటి పరీక్షల శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి వారం హైదరాబాద్ నుంచి స్పెషలిస్టు వైద్యులు వచ్చి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులూ అందించనున్నారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంపాదనలో కొంత పేదలకు, ఆపదలో ఉన్న వారికి వెచ్చించాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ ముజీబ్ ఖాన్ సేవలు అభినందనీయమన్నారు. ముజీబ్ ఖాన్ మాట్లాడుతూ.. బీదలకు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరుణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది



కుటుంబీకులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ములుగు జిల్లాలో మందుపాతర పేలి మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మందుపాతర పేలుడుతో మృతిచెంది న గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ నివాసం ఘట్‌కేసర్‌లో ఆదివారం రాత్రి కుంటుంబ సభ్యులను మహేందర్‌రెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, 300వందల గజాల ఇంటి స్థలం, ఒకరికి ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించిందని గుర్తుచేశారు. సందీప్ భార్య, తల్లితో మాట్లాడి ఓదార్చారు.

వేములనర్వలో గుప్తనిధుల వేట



గుప్త నిధుల కోసం తవ్విన భూమి

కేశంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో రెండు మూడు రోజుల క్రితం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో తవ్వకాలు జరిపి అనంతరం గుంతను పూడ్చేశారు. ఆదివారం అటుగా వెళ్లిన కొందరు చూసి గ్రామస్తులకు తెలపడంతో నిధుల కోసమే తవ్వకాలు జరిపినట్లు చర్చించుకున్నారు. గతంలోనూ ఈ పొలంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారని గ్రామస్తులు తెలిపారు. మళ్లీ ఇలా తవ్వకాలు జరపడంతో ఈ విషయం గ్రామంలో కలకలం రేపింది. అక్కడ పూజలు నిర్వహించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. అక్కడ ఉన్న బండపై కుండకు సంబంధించిన పెంకులు కూడా ఉండడంతో గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో బీరప్ప గుడి కూడా ఉంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంట మార్పిడి.. ప్రయోజనకరం

- భూమిలోని పోషకాల పూర్తి వినియోగం
- చీడపీడలు, రోగాల నుంచి పైర్లకు రక్షణ
- రైతుకు తగ్గనున్న పెట్టుబడి ఖర్చు



యాచారం, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులు పంటమార్పిడి విధానంతో ఎక్కువ దిగుబడి సాధించడంతో పాటు చీడపీల నివారనతో పెట్టుబడి ఖర్చుతూ గణనీయంగా తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతీ పంటకు పంట మార్పిడి పద్ధతి పాటించాలని సూచిస్తున్నారు. భూమిలో ప్రతీ ఫసల్‌కు ఒకే పంట పండిస్తే నేలలోని పోషకాలు పంటకు సరిగ్గా అందవు. అలాగే విభిన్న పంటలు రకరకాల పోషకాలను వినియోగించుకుంటాయి కాబట్టి అన్ని పోషకాలు వినియోగం కావాలంటే వివిధ పంట లు పండించాలి. ఒకే పంటను పండిస్తే రసాయన ఎ రువుల వినియోగం పెరుగుతుంది. అలాగే నేల సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఒకేపంట సాగుతో దిగుబడి కూడా పడిపోతుంది. ఈ వేసవిలో పంట మార్పిడిపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఏవో రవినాథ్ తెలిపారు. సాగు మెలకువలు వివరించారు.

పంటల మార్పిడి... ప్రయోజనాలు

ప్రతీ పంటకు భూమిలో అన్ని రకాల సూక్ష్మధాతువుల వినియోగం పూర్తికావాలంటే కొన్నిసార్లు గుబురువేరు మొక్క పంటలు, మరో పంటకు తల్లివేరు రకం పంటలను సాగు చేయాలి. వరి, పొద్దు తిరుడుగు, టమాట, మిరప తదితర పంటలు గుబురువేరు మొక్కలు కలిగిన పంటలు. అలాగే మొక్కజొన్న, పత్తి, కంది, నువ్వులు, పజ్జొన్న, పెసర, కాకర, దోస, బీర, చిక్కుడు వంటి ఆహార, కూరగాయ పంటలు తల్లివేరు మొక్కల పంటలు. అలాగే ఒకే రకం పంటల్లో శిలీంధ్ర రోగాలు, కీటకాలు ఎక్కువ ఆశిస్తాయి. పంటమార్పిడితో రోగాలు అన్ని పంటలకు రావు. పంట మార్పిడితో సహజంగా కొన్ని రకాల పురుగులు, కలుపు మొక్కలు నేలలో నాశనం అవుతాయి. మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వేసవి దుక్కులతో పంటలను ఆశించే పురుగులు ఎండ వేడికి చనిపోతాయి. సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతిక స్థితి గణనీయంగా మెరుగుపడుతుంది. మొక్కలకు నత్రజని వినియోగం తగ్గుతుంది.

రైతులు ఇవి పాటించాలి

దీర్ఘకాలిక పంటలు సాగుచేసే పొలాల్లో పంట మార్పిడి కింద స్వల్పకాలిక పంటలైన కూరగాయలు సాగు చేయాలి. లెగ్యూమ్‌జాతి పైర్లు వేస్తే రైజోబియం బుడిసెలు ఏర్పడతాయి. ఈ మొక్కలు పచ్చిరొట్ట ఎరువుగా మారేందుకు భూమిలో కలియదున్నాలి. చిక్కుడు జాతి మొక్కలతో నేలలో భూసారం పెరుగుతుంది. ఒకసారి జొన్న వేస్తే మరుసటి ఏడాది ఆముదం లేదా కంది, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలి. రెండుసార్లు దీర్ఘకాలిక పంటలేస్తే మరోమారు స్వల్పకాలిక పంటలైన కూరగాయల సాగుచేయాలి. వరి తరువాత పప్పు దినుసులు సాగుచేసుకోవాలి. దీనితో నేలలో నెమటోడ సంఖ్య తగ్గుతుంది. తేలిక భూముల్లో నీటిపారకం కింద వేరుశనగ లేదా చిక్కుడు పంటలు వేసుకోవాలి. బెండ, బీర, దొండలాంటి పంటల తర్వాత బంతిపూలు, నువ్వులు వేసుకోవాలి. వయ్యారిభామ కలుపు మొక్కల నివారణకు గడ్డిజాతి మొక్కలు సాగు చేయాలి. తక్కువ సారముండే భూముల్లో జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి మొక్కల పూత సమయంలో భూమిలో కలిసేలా నాలుగు సాళ్లు దున్నాలి.



రవినాథ్, ఏవో

ఇలా చేయొద్దు...

వేరుశనగపైరు తీసి మరలా వేరుశనగ పంట అస్సలు వేయొద్దు. ఇలా చేస్తే ఎర్రగొంగళి పురుగు, శనగపచ్చపురుగు, లద్దె పురుగు, ఆకుమచ్చ తెగులు, మొవ్వకుళ్లు తెగుళ్లు ఉధృతంగా వస్తాయి. బెండ తరువాత పత్తిపంట వేయాలి. నులిపురుగులు ఉండే ప్రాంతంలో వంగ, బెండ, టొమాటో, ఉలవ, మినుము, పెసర పంటలేసుకోవాలి. తేలిక నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి. ఎర్రబంకమట్టి నేలలు, రేగడి నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.

అంగట్లో పనిముట్లు

రైతులకు తొలగిన ఇక్కట్లు!



పరిగి మార్కెట్‌లో విక్రయిస్తున్న వ్యవసాయ పనిముట్లు

పరిగి, మే 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు తప్పనిసరి. గతంలో రైతులు గొడ్డలి, కొడవలి, కమ్మకత్తి, ఎరుకల కత్తి, దంతెకాళ్ల వంటి పరికరాలను కమ్మరుల కొలిమి వద్ద చేయించుకునే వారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లల్లోనే అన్ని రకాల పనిముట్లు, వస్తువులు రేడీమేడ్‌గా లభ్యమవుతున్నాయి. గతంలో వడ్రంగి, కమ్మరి వంటి కుల వృత్తుల వారి దగ్గరికి వెళ్లేవారు. ఇప్పుడు వృత్తి పనివారి దగ్గరికి వెళ్లాల్సిన పరిస్థితి లేదు. అన్ని రకాల పనిముట్లు మార్కెట్‌లో లభ్యం అవుతున్నాయి. ముఖ్యంగా వారాంత అంగళ్లలో వ్యవసాయ ఇనుప పనిముట్లు భారీగా అమ్ముతున్నారు. ఇళ్లలో, పొలా ల్లో వినియోగించే పనిముట్లు పరిగి మార్కెట్లో లభ్యమవుతున్నాయి. పనివారి చుట్టూ తిరిగే పని లేకపోవడంతో రైతులకు ఇది సౌలభ్యంగా ఉంది. తయారు చేయించుకునే సమయం వారికి కలిసి వస్తోంది.

గొడ్డళ్లు: వీటితో పొలాల్లో ముళ్లచెట్లు, పొదలను నరుకుతారు. అలాగే పొయ్యిల కట్టెలు కొట్టేందుకు ఉపయోగిస్తారు. గొర్ల కాపరులు చెట్ల కొమ్మలు నరుకుతారు. వీటి ధర రూ.250 నుంచి రూ.350 వరకు ఉంది.

కర్లు: నేలను దున్నేందుకు ఉపయోగించే నాగళ్లకు తోడుగా కర్లను ఉపయోగిస్తారు. నాగలి ముందు భాగంలో ఉంచితే నేలను సునాయసంగా దున్నవచ్చు. వీటిని ఒక్కటి రూ.90 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు.

కొడవళ్లు: వీటిని పలు రకాల పంటలను కోసేందుకు ఉపయోగిస్తారు. ఒక్కోటి రూ.150 నుంచి రూ.250 వరకు అమ్ముతున్నారు. వెంటనే ఉపయోగానికి వీలుగా పిడి వేసి ఉంచుతున్నారు.

కలవార: పంట పొలాల్లో వచ్చే కలుపు మొక్కలను తొలిగించేందుకు ఉపయోగిస్తారు. వీటిని రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తారు.

గుంటుక పలుగులు: పంట పొలాల్లో విత్తనాలు విత్తేందుకు ముందు నేలను చదను చేసుకునేందుకు గుంటుకకు పలుగులను ఉపయోగిస్తారు.



కొడవళ్లు



గొడ్డళ్లు

వీటిని ఒక్కోటి రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.

పారముట్లు(వడ్డెపార): వీటిని పంట పొలాల్లో కాలువలు చేసేందుకు, వొడ్లు నరికేందుకు ఉపయోగిస్తారు. వీటిని రూ.200 వరకు విక్రయిస్తారు.

మటన్ కత్తి: వీటిని మాంసాన్ని ముక్కలుగా చేసేందుకు ఉపయోగిస్తారు. వీటి ధర రూ.80 నుంచి రూ.100.

సేర్లు: వీటిని కొలతలుగా ఉపయోగిస్తారు. వీటిని ధాన్యం కొలతలకు వాడుతుంటారు. ఒక్కోటి రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

పెంకలు: వంటింట్లో రొట్టెలు చేసేందుకు ఉపయోగిస్తారు. రూ.120 నుంచి 200కు అమ్ముతున్నారు.

అన్ని పనిముట్లు దొరుకుతున్నాయి



గతంలో ఏ పనిముట్టుకైనా వృత్తిపని వారి చుట్టూ తిరిగేవాళ్లం.ఎక్కువమంది రైతులం వెళ్తుండడంతో వారికి డిమాండ్ ఉండేది. వ్యవసానికి ఏ పనిముట్టయినా చేయించుకునేందుకు వారం పట్టేది. ఇప్పుడు మార్కెట్‌లో అన్ని పనిముట్లు దొరుతున్నాయి. పైసలు పోయినాసరే.. అవసరమైనప్పుడు లభ్యమవుతున్నాయి.

- గోల్యానాయక్, రైతు నజీరాబాద్ తండా

ఎప్‌సెట్‌లో విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు



కె.ప్రణవ్ తేజ



అభినవ్‌రెడ్డి



విశ్వక్



ఆర్.చందన

పరిగి/యాలాల/చౌదరిగూడ/షాద్‌నగర్ అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆదివారం ప్రకటించిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ(ఎప్‌సెట్) ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో పలువురు విద్యార్థులు రాష్ట స్థాయి ర్యాంకులు సాధించారు. పరిగి పట్టణ పరిధి టీచర్స్ కాలనీలో ఉండే టీచర్ కనకం గౌరీశంకర్ కుమారుడు కె.ప్రణవ్ తేజ 128.71/160 మార్కులతో రాష్ట్రస్థాయి 45వ ర్యాంక్ సాధించాడు. యాలాల మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నర్సిరెడ్డి కుమారుడు జి.అభినవ్‌రెడ్డి 447వ ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు అతడికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట్‌కు చెందిన మందారం మంజుల, శ్రీనయ్య దంపతుల కుమారుడు విశ్వక్ టీజీ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 110 మార్కులతో రాష్ట స్థాయిలో 213వ ర్యాంక్ సాధించాడు. సివిల్ సాధించమే తన లక్ష్యం అని ఈ సందర్భంగా విశ్వక్ తెలిపాడు. షాద్‌నగర్ విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆర్.చందన 1,505వ ర్యాంక్‌ను సాధించింది. చందనను కళాశాల ప్రిన్సిపాల్ వి.విశ్వనాథ్ అభినందించారు.

మానవాళికి భగవద్గీత మార్గదర్శకం



పట్టణంలో భగవద్గీత ప్రచారాన్ని నిర్వహిస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

మేడ్చల్ టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): మానవాళికి భగవద్గీత మార్గదర్శకమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు అన్నారు. సేవా సమితి సభ్యులు మేడ్చల్ పట్టణంలోని బాలాజీనగర్ కాలనీలో ఆదివారం భగవద్గీత ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక హైదరాబాద్ కమిటీ సభ్యుడు సీహెచ్.గిరి, ఎన్ఎస్.కుమార్, మధు, నర్సింహాచారి, చంద్రకళ, నాగమణి, పద్మ, స్వప్న పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- నేడు 300 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం
- ప్రారంభించనున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి



ప్రారంభ వేడుక కోసం తెచ్చిన పూలు

వికారాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి):ఏళ్లుగా ఎదురు చూసిన సమయం రానే వచ్చింది. వికారాబాద్ జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు నిర్మించిన 300 పడకల ఆసుపత్రి సోమవారం ప్రారంభం కానుంది. కొత్త భవనంలో 300 పడకలు, క్రిటికల్ కేర్‌లో 50పడకలు, పాత ఆసుపత్రితో కలిపి మొత్తం 400 బెడ్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు స్పెషాలిటీ వైద్య సేవలు అందనున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా 300 పడకల ఆసుపత్రిని నేడు ప్రారంభించనున్నారు.

తీరనున్న కష్టాలు

గతంలో వికారాబాద్‌లో ఉన్న కమ్యూనిటీ ఆసుపత్రిలో ఎక్కువ పడకలు, సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఎమర్జెన్సీ సర్వీసులను వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేసే వారు. వికారాబాద్ జిల్లా కేంద్రంగా మారడంతో 100 పడకల ఆసుపత్రి నిర్మించాలని మొదట్లో రూ.9.50కోట్లతో నిర్మాణం చేపట్టారు. అనంతరం వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ రావడంతో వంద పడకల ఆసుపత్రిని 300 పకడలకు పెంచాలని నిర్ణయించి ఇందుకు మరో రూ.30కోట్లు వెచ్చించి ఆసుపత్రిని నిర్మించారు. ఇందులో ఆస్పత్రి మొదటి, రెండో అంతస్తు నిర్మాణానికి రూ.23.75కోట్లతో పనులను చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్‌కు రూ.16కోట్లతో నిర్మాణ పనులు కొనసాతున్నాయి.

అనంతగిరిలో ప్రస్తుతం వైద్య కళాశాల

వికారాబాద్‌కు ఆరు కిలో మీటర్ల దూరంలో అనంతగిరి టీబీ ఆసుపత్రిలో తాత్కాలికంగా వైద్య కళాశాలను కొనసాగిస్తున్నారు. అయితే మేకల గండిలో నూతన వైద్య కళాశాల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. విద్యార్థులకు ప్రాక్టికల్ కోసం ప్రస్తుతం ప్రారంభమవుతున్న 300 పడకల ఆసుపత్రిని వినియోగించనున్నారు. వైద్య కళాశాలలో 56 మంది డాక్టర్లు, 38మంది బోధకలున్నారు. 55 మంది నర్సులు అందుబాటులో ఉన్నారు. క్షయ ఆసుపత్రి విభాగాల నర్సులు 30మంది ఉన్నారు. వికారాబాద్‌లో వైద్య కళాశాల 2023లో మంజూరు కాగా సెప్టెంబరులో ప్రారంభించారు. 100 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించగా ప్రస్తుతం వారు మూడో సంవత్సరం చదువుతున్నారు.

స్పెషాలిటీ వైద్య సేవలు

వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడ అన్ని రకాల ఆపరేషన్లు, ఆర్థో సేవలు రానున్నాయి. పాము కరిచినా అందుకు తగ్గ వైద్య సేవలు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఐసీయూ, వెంటిలేటర్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు తప్ప మిగితా అన్ని రకాల ఆపరేషన్లు, సేవలను ఇక్కడ వైద్యులు అందిస్తారు. అధునాతన యంత్ర పరికరాలను అమర్చారు.

రైల్వే లెవల్ క్రాసింగ్, నీటి వ్యవస్థ సమస్య..

వికారాబాద్‌లో అన్ని రకాల సేవలతో ప్రారంభమవుతున్న ఆసుపత్రికి ప్రస్తుతం రైల్వే ట్రాక్, మంచినీటి సమస్యలే కన్పిస్తున్నాయి. ఆసుపత్రికి వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ ఉండడంతో రైల్వే గేటు పడితే అరగంట వేచి ఉండాలి. మంత్రులు, వచ్చిన ముఖ్యమంత్రి వచ్చిన వికారాబాద్ తాండూరు వెళ్లాలంటే ఈ రైల్వే గేటు దాటాల్సిందే. దీంతో ఎమర్జెన్సీ సేవలకు ఇబ్బంది కలగనుంది. ఎమర్జెన్సీ కోసం వికారాబాద్ పాత ప్రభుత్వ ఆసుపత్రిని ఉపయోగిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఆస్పత్రిలో నీటి సమస్య తీర్చాలంటే మిషన్ భగీరథ పైపులైన్ వేయాల్సి ఉంది.

స్పెషాలిటీ సేవలు అందిస్తాం

నేడు ప్రారంభమయ్యే ప్రభుత్వ ఆసుపత్రి 300పడకలు ఉంటాయి. స్పెషాలిటీ వైద్యసేవలు ప్రజలకందుతాయి. రైల్వే గేటు విషయంలో ఎమర్జన్సీ సేవలపై అధికారులతో చర్చిస్తాం. అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- రాంచంద్రయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్, వికారాబాద్

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, మే11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలు మెరుగైన వసతులు కల్పించి పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నదని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని 12,13 వార్డులలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం పనులను ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతగా, వేగంగా పూర్తిచేయాలని సూచించారు. కడ్తాల మండలంలో ఎస్సీ సబ్ ప్లాన్‌నిదులతో 28పనులను 1.30 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఆ నిధులతో ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మిస్తున్నట్లు చెప్పారు. పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు మంకి శ్రీను, రమేశ్, శ్రీకాంత్, రామకృష్ణ, నరేశ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలను సాగు చేయాలి



- కందుకూరు ఏవో లావణ్య

ఫటాఫట్

కందుకూరు, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు పొందుతారని, యాసంగిలో వేసిన పంటలకు బదులుగా ఖరీఫ్‌లో ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని కందుకూరు మండల వ్యవసాయాధికారి లావణ్య సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు వరి, పూల తోటలతో పాటు కూరగాయలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈమేరకు ఏవో 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: 2024-25లో రైతులు ఏయే పంటలను సాగుచేశారు?

జవాబు: మండలంలో 14,229 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి 5,437 ఎకరాలు, మొక్కజొన్న 1,497, నూనె గింజల పంటలు 200, ఆకుకూరలు 702, కూరగాయల పంటలు 1,200 ఎకరాల్లో ఇతరత్రా పంటలు సాగు చేశారు.

ప్రశ్న: ఈసారి వర్షాకాలంలో ఏయే పంటల సాగు మంచిది?

జవాబు: వానాకాలంలో రైతులు వరి సాగు చేసే ముందు దుక్కులు దున్నుకోవాలి. దాంతో తెగులు, చీడపురుగులు వృద్ధి చెందకుండా ఉపకరిస్తుంది. కంది పంటలో ఎండు తెగులు సమస్య ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రశ్న: యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఎంత వరకు వచ్చాయి?

జవాబు: మండల కేంద్రంలో 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. రెండు రోజుల నుంచి రైతులు రి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తున్నారు. ఇప్పటి వరకు 70 క్వింటాళ్లు వచ్చాయి.

ప్రశ్న: పంటల మార్పిడితో కలిగే లాభాలు ఏమిటి?

జవాబు: ఒకే పంటను సాగుచేస్తే పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. దీనికి పరిష్కార మార్గమే పంట మార్పిడి. పంటలను సాగు చేసేప్పుడు అంతర పంట విధానాన్ని అనుసరించాలి. పంట మార్పిడితో తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ దిగుబడి ఆశించవచ్చు.

విద్యుత్ కోతలతో జనం ఇక్కట్లు

- మరమ్మతుల పేరుతో నిత్యం అంతరాయం
- ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- అధికారుల తీరుపై తీవ్ర అసహనం



నందిగామ మండల కేంద్రంలో రాత్రివేళ కరెంట్ లేకపోవడంతో అంధకారంలో ముఖ్యకూడలి(ఫైల్)

నందిగామ, మే 11(ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలకు ప్రజలు ఒకవైపు ఉక్కిరిబిక్కిరి అవుతుంటే దానికి తోడు వేలాపాల లేని విద్యుత్ కోతలతో బెంబేలెత్తిపోతున్నారు. నందిగామ మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఓ వైపు మండుతున్న ఎండలు, మరోవైపు కరెంటు ఎప్పుడు ఉంటుందో.. పోతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని రోజులుగా మండలంలో సుమారుగా 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లే పరిస్థితి లేదు. కానీ, కరెంట్ కోతల వల్ల ప్రజలు ఇళ్లలో కూడా ఉండలేని పరిస్థితి. పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. గంటల పాటు విద్యుత్ అధికారులకు ఫోన్లుచేసినా పట్టించుకోకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. కరెంట్ ఎంతసేపు తీస్తారో.. ఎప్పుడు తీస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉరిమినా, మెరిసినా.. గట్టిగా గాలి వీచినా కరెంట్ కట్ అవుతోంది. చిన్నపాటి వర్షం పడినా గంటల పాటు కరెంట్ పోతోంది. విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతుల పేరుతో కరెంట్ కట్ చేస్తుండడంతో ప్రజలు, వ్యాపారులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండడంతో పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఒకవైపు అంతరాయం లేనినాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తుంటే.. మండలంలో మాత్రం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మరమ్మతుల పేరుతో విద్యుత్ కోతలు విధించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఎండ తీవ్రత, ఉక్కపోతను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి



కోతలు లేకుండా విద్యుత్ అందించాలి. నందిగామలో డ్రైక్లీనింగ్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నా. కరెంట్ కోతలతో పనులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. అధికారులు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలి.

- చింతలవల్లి యాదయ్య, డ్రైక్లీనింగ్ షాపు నిర్వాహకుడు

నాణ్యమైన విద్యుత్ అందించాలి



ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తుంది. అయితే, అధికారులు ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేస్తూ కోతలు లేకుండా నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలి. ఈమేరకు అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ తగిన చర్యలు తీసుకోవాలి.

- జంగ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు

క్రైం కార్నర్

దాడి కేసులో నలుగురి రిమాండ్

యాచారం, మే 11(ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నలుగురికి రిమాండ్ విధించారు. యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీసాల తండాలో ఇటీవల చోటుచేసుకున్న భూ తగాదాలో రాకేష్, పవన్, రాంజీలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన జైపాల్, పుల్యా, సుధాకర్, గోవింద్‌లను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా, మీసాల తండాకు చెందిన దాయాదులు పరస్పరం దాడులకు దిగిన సంగతి విదితమే. ఈ మేరకు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

చేద్దామని ఆ సమయంలో హామీ ఇచ్చారు. అయితే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పల్లె ఆనంద్ కుమార్, అన్నగళ్ల రమేష్, నిదురం కృష్ణయ్యలు చెరువును ఆధునికీకరించడం తోపాటు బ్రిడ్జి నిర్మాణం చేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. చెరువు కట్ట విస్తరణ చేసి, పటిష్టం చేయాలన్నారు. కట్టపై ఉన్న గ్రామ దేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. తూములకు, అలుగుకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఇందుకు ఓ ప్రైవేట్ ఏజెన్సీతో రూపొందించిన డీపీఆర్‌ను ఎమ్మెల్యేకు అందించారు. చెరువును నవీకరణ, సుందరీకరణ చేయడానికి రూ.4కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చెరువు అభివృద్ధికి హామీ ఇచ్చారు



పోమాల్‌పల్లి- కొండారెడ్డిపల్లి చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. నేను ఓ ప్రైవేటు ఏజెన్సీతో చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం డీపీఆర్ తయారు చేయించా. చెరువు అభివృద్ధికి, సుందరీకరణకు రూ.4కోట్ల అంచనాతో డీపీఆర్ ఇచ్చారు. అది అలాగే ఎమ్మెల్యేకు అందించా.

- పల్లె ఆనంద్ కుమార్- కొండారెడ్డిపల్లి

విడతల వారీగా నిధులు కేటాయిస్తానని చెప్పారు



చెరువును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరాం. ఆయన ఇందుకు సానుకూలంగా స్పందించారు. అయితే పెద్ద ఎత్తున్న నిధులు అవసరం ఉన్నందున విడతల వారీగా నిధుల కేటాయిస్తానని చెప్పారు. చెరువును బాగుచేస్తే చాలామందికి ఉపాధితో పాటు చెరువు కింద ఉన్న రైతులు మూడు పంటలు సాగు చేసుకోవచ్చు.

- ఎ.రమేష్, యూత్ కాంగ్రెస్ కేశంపేట మండలాధ్యక్షుడు

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తికి మహర్దశ ఏర్పడిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా నియోజవకర్గంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.52 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, హన్మనాయక్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



ఆమనగల్లు, మే 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని గంగభవాని కాలనీకి చెందిన 15 మంది విద్యార్థినీ విద్యార్థులు ఇటీవల వెలువడిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ, పదవ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. గంగాభవాని కాలనీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వారికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన మాధవి, అశోక్, చందన, కిషోర్, టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన వైష్ణవి, ధృవాంశ్‌లను కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సత్కరించి జ్ఞాపికలందజేశారు. అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టార్గెట్ 41.72 లక్షలు

(5వ పేజీ తరువాయి)



ఆరూర్ గ్రామంలోని నర్సరీలో మొక్కలు

531 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతీ గ్రామంలో ఉన్న నర్సరీల్లో మొక్కలు నాటేందుకు రెడీగా ఉన్నాయి. ఒక్కో నర్సరీలో 10 వేల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో అన్ని శాఖలను భాగస్వామ్యం చేయనున్నారు. ఈ సారి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 41,72,000 మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. టేకు మొక్కలతో పాటు మల్బరీ, వేప, వెదురు, మునగ మొక్కల పెంపకంపై అధికారులు దృష్టిసారిస్తున్నారు. ఇదిలా ఉండగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఎన్ని మొక్కలు నాటుతారనే విషయం ఇంకా స్పష్టత లేదు. వన మహోత్సవ కార్యక్రమానికి డీఆర్‌డీఏ అధికారులు చురుగ్గా ముందుకు సాగుతున్నారు. కానీ.. అటవీ శాఖ ఆధ్వర్యంలో నాటాల్సిన మొక్కల లక్ష్యంపై నిర్లక్ష్యంగా ఉన్నారు.

వృథా తగ్గింపు..!

గత తొమ్మిది విడతలుగా హరితహారం, పదో విడతలో వనమహోత్సం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు వృథా 50 శాతం కంటే ఎక్కువగా ఉన్నట్లు కింది స్థాయి అధికారులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా గ్రామాల వారీగా లక్ష్యాలను ఇచ్చి మొక్కలు పెంచేవారు. వాటిని గ్రామాలకు తరలించేందుకు భారీగా నిధులు ఖర్చయ్యేవి. నాటేందుకు సరైన స్థలాలు లేక మొక్కుబడిగా మొక్కలు నాటేవారు. ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలాల్లో మొదటి నుంచి మూడు, నాలుగు విడతల్లోనే మొక్కలు నాటారు. అదే స్థానంలో నాటాలంటే పాతవాటిని నరికేసి కొత్తవి నాటాల్సిన పరిస్థితి. దాంతో పాటు చాలా మొక్కలను ఇంటింటికీ ఇచ్చినట్లు రాసుకుని ఎక్కడ బడితే అక్కడ వదిలేసేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఈ సారి లక్ష్యాలను భారీగా తగ్గించనున్నారు. దీంతో ఎక్కడ అవసరమో అక్కడే కొద్ది స్థాయిలో మొక్కలు నాటేందుకు అవకాశముంది. పండ్లు, నీడనిచ్చే మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

జిల్లాలో ఇప్పటి వరకు 10 విడతల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 11వ విడతలో నిర్వహించనున్న వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు అందించి.. వాటిని నాటేందుకు అధికారులు ప్రోత్సహించనున్నారు. ప్రజలు అడిగిన మొక్కలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్లనేరేడు, గానుగ, తులసి, ఈతతో పాటు ఔషధ, పూల మొక్కలను కూడా సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్టు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, కళాశాలల ఆవరణలో నాటేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీంతో పాటు అటవీ ప్రాంతాల్లో మరింత ఆహ్లాదాన్ని పెంచేవిధంగా పూల, పండ్ల మొక్కలను నాటనున్నారు. ఇందుకోసం నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఈ సారి టేకు, మల్బరీ, వేప, వెదురు, మునగ మొక్కలను నాటేందుకు సిద్ధమవుతున్నారు.

25 నర్సరీల్లో మొక్కల పెంపకం

చేవెళ్ల : చేవెళ్ల మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో నర్సరీల్లో మొక్కల పెంపకం చేపడుతున్నారు. ప్రతీ పంచాయతీలో 8 నుంచి 10 వేల మొక్కల చొప్పున మొత్తం మండలం వ్యాప్తంగా 2లక్షలకు పైగా మొక్కలు నాటేలా అధికారులు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయ ప్రాంగణాలు, బస్టాండ్, రోడ్లకు ఇరువైపులా, రైతులకు ఉపయోగపడే విధంగా అన్నిరకాల మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీ పనులను ఎప్పటికప్పుడు ఎంపీడీవో, ఎంపీవోలు పరిశీలిస్తున్నారు.

నర్సరీల్లో మొక్కలు రెడీ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో రెడీగా ఉన్నాయి. పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకం చురుకుగా సాగుతుంది. మండలంలో ఉన్న నర్సరీలను నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు పలు సూచనలు చేస్తున్నాం.

- హిమబిందు, ఎంపీడీవో, చేవెళ్ల

మానవ సేవే మాధవ సేవ



మజ్జిగను పంపిణీ చేస్తున్న సహాయత ట్రస్టు సభ్యులు

కొత్తూర్, మే 11(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని సామాజిక సహాయత ట్రస్ట్ చైర్మన్ శ్వేత రౌల్ అన్నారు. వేసవిని నేపథ్యంలో మండల కేంద్రంలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్వేత రౌల్ మాట్లాడుతూ వేసవిని నుంచి ప్రజలు కొంత ఉపశమనం పొందేందుకు ట్రస్ట్ ద్వారా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుకు చెందిన ప్రదీప్‌కుమార్ మొహంతి, మనీష్, పూజ, అలేఖ్, సంతోష్, మంగులు, సత్య, విజయ్, కృష్ణ, బివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనృసింహుడి కల్యాణం



శంషాబాద్ : నృసింహస్వామి ఆలయంలో తాలిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



కందుకూరు : చెన్నకేశ్వరాలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితుడు, పాల్గొన్న భక్తులు

శంషాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పురాతన శ్రీ నర్సింగ్‌మందిర్ ఆలయంతో పాటు కుమ్మరిబస్తీలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జయంతి వేడుకలతో పాటు కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే దేవాలయాల్లో స్వామివారికి అభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవచనం, సుదర్శన హోమం, తదితర పూజలు చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు. పూజా కార్యక్రమాల్లో మున్సిపాలిటీలోని వివిధ బస్తీల ప్రజలు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఉత్సవాలు ప్రారంభం

కందుకూరు : మండలంలోని ఉట్లపల్లి దేవనిగుట్ట వద్ద జరుగుతున్న శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య దేవతామూర్తుల విగ్రహాల అలంకరణతో పూజలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం మహాగణపతి పూజ, చండీహోమం, నవగ్రహ, వాస్తు సుదర్శన హోమాలు, అభిషేకం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నేడు(సోమవారం) మధ్యాహ్నం స్వామివారి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్ తెలిపారు.

నందుపల్లిలో రేణుకా ఎల్లమ్మ బోనాలు

మహేశ్వరం : మండల పరిధిలోని నందుపల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం లందకు మయిలలు తీసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన పుష్పలంకరణతో ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అమ్మవారికి గ్రామపెద్దలు బోనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో నర్సింహ, రాజు, జగదీష్‌గౌడ్, రవి, సత్తయ్య, చంద్రయ్య, వెంకటయ్య, జంగయ్య, జయేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం

తలకొండపల్లి : సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలం వెల్జాలలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శ్రీనివాస్ యాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. నాయకులు ముజుబుర్ రెహమాన్, వెంకట్‌రెడ్డి, అశోక్, రవీందర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జన్మతిథి మహోత్సవం

యాచారం : నందివనపర్తిలో ఈనెల 22న శ్రీహనుమాన్ జన్మతిథి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జ్ఞానసరస్వతి సంస్థాన్ ప్రకటనలో పేర్కొంది. శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో స్వామి వారికి ప్రత్యేక పూజలుంటాయని, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.



మహేశ్వరం : రేణుకా ఎల్లమ్మ ఆలయానికి బోనాలతో తరలిన గ్రామస్థులు

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, మే 11(ఆంధ్రజ్యోతి): మైసిగండికి చెందిన ఇస్లావత్ శ్రీను అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్‌నాయకుడు జవహర్ లాల్ నాయక్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వపరంగా తగిన సాయమందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు కిషన్, బిక్కు, దశరథ్, శ్రీను, తులసీరామ్, జగన్, తదితరులున్నారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం

మహేశ్వరం, మే 11(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడంతో పాటు ఆపన్నహస్తంగా యశ్వ ఫౌండేషన్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ పల్నాటి నరేష్ నేత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన పోచయ్య-సుజాత దంపతుల కూతురి వివాహానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ వెలకట్టలేనిది



షాద్‌నగర్ అర్బన్ : వృద్ధురాలికి చీర, పండ్లు ఇస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కడ్తాల : మెడికల్ కిట్లు అందిస్తున్న జైపాల్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్

షాద్‌నగర్ అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి, కనిపెంచిన అమ్మ ప్రేమ వెలకట్టలేనిదని, అమ్మకేమిచ్చినా రుణం తీర్చుకోలేమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్‌సీఎన్ ఫౌండేషన్‌లో ఆదివారం షాద్‌నగర్‌కు చెందిన యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ మొదటి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సామాజిక సేవే లక్ష్యంగా ఏర్పాటు చేసిన యువైసీ ఫౌండేషన్ లోగోను ఆయన ప్రారంభించారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో వృద్ధులకు భోజనాన్ని వడ్డించారు. మహిళలకు చీరలను, పండ్లను ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరో అనాథ వృద్ధులకు ఆశ్రయమిచ్చి, వారి ఆలనాపాలనను చూస్తున్న ఎఫ్‌సీఎన్ ఫౌండేషన్ నిర్వాహకులు గీతా థామస్‌లను ఎమ్మెల్యే అభినందించారు. అలాగే సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు వచ్చిన యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మమద్ ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి షేక్ అక్రమ్‌లాల, సభ్యులు షేక్ సోహెల్, షోయబ్‌మతానీ, అబ్దుల్ ముతలీఫ్‌జామి తదితరులను ఎమ్మెల్యే అభినందించారు. మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు విశాలశ్రవణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, న్యాయవాది సబియా సుల్తానా, అలియా సుల్తానా, కాంగ్రెస్ నాయకులు రఘునాయక్, ఎండీ ఇబ్రహీం, బస్వం, కొమ్ము కృష్ణ, ఎస్డీ ఖదీర్ తదితరులున్నారు.

తల్లిని మించిన దైవం లేదు

కడ్తాల్ : సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని, నవ మాసాలు మోసి తన ప్రాణాన్ని పణంగా పెట్టి మనకు జన్మనిచ్చి లోకాన్ని చూపించే అమ్మ కనిపించే దైవమని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజనిసాయిచంద్‌లు అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గాంధీచౌక్ వద్ద నిర్వహించిన వేడుకల్లో కడ్తాల మండలానికి చెందిన 240 మంది గర్భిణీలకు ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెడికల్ కిట్లను డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్, విజితారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డిలతో కలిసి వారు పంపిణీ చేశారు. రెండు రోజుల్లో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాలకు చెందిన 3,220 మంది గర్భిణీలకు అందజేస్తామని వెంకటేశ్ తెలిపారు. న్యూట్రిషన్ మెడికల్ కిట్లు సమకూర్చిన ఆయన్ను వారు అభినందించి సత్కరించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు పరమేశ్, శంకర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌యాదవ్, గంప శ్రీను, లచ్చిరామ్ నాయక్, రమేశ్‌నాయక్, సేవ్యనాయక్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



ఆమనగల్లు : మురళీనాయక్ చిత్రపటానికి వందనం సమర్పిస్తున్న రవీందర్ నాయక్

ఇబ్రహీంపట్నం/కందుకూరు/ఆమనగల్లు, మే 11(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో భారత్ ఉద్రిక్తతల నేపథ్యంలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్లు మురళీనాయక్, సచిన్ యాదవ్‌రావు పనాంజేలకు శనివారం రాత్రి ఇబ్రహీంపట్నంలో ఏబీసీడీ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అమర జవాన్ల చిత్రపటాలతో జైజవాన్ అంటూ నినాదాలు చేశారు. డ్యాన్స్ అకడమీ మాస్టర్లు ముత్యం, సురేష్, బన్నీ, తార తదితరులున్నారు. గిరిజన ముద్దు బిడ్డ మురళీనాయక్ అమరుడయ్యాడని మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, గిరిజన సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ నాయకులు ఎస్.లచ్చానాయక్‌లు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం రాత్రి కందుకూరు మండలంలోని పెద్దమ్మతండాలో గిరిజనులతో కలిసి కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఎస్.సుమన్‌నాయక్, నాయకులు కె.వస్యనాయక్, కె.మోహన్‌నాయక్, శంకర్‌నాయక్, ఎస్.రవి, ఎం.విజయ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. భారత సైనికుల క్షేమాన్ని కోరుతూ ఆదివారం ఆమనగల్లు పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా, మండల నాయకులు శేఖర్, కృష్ణయాదవ్, రవిరాథోడ్, పద్మప్రశాంత్, మహేశ్, కర్నాటి జగన్ రెడ్డి, పవన్ కళ్యాణ్, సాయిబాబా, శ్రీనివాసాచారి, రామస్వామి, శ్రీకాంత్ తదితరులున్నారు. మురళీనాయక్ కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర గిరిజన నాయకుడు, కాంగ్రెస్ నేత రవీందర్‌నాయక్ పరామర్శించారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన పలువురు గిరిజన నేతలతో కలిసి మురళీనాయక్ స్వస్థలం శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు వెళ్లారు. మురళీనాయక్ ఫొటోను సందర్శించి నివాళులర్పించారు. తల్లిదండ్రులు జ్యోతిబాయి శ్రీరామ్ నాయక్‌లను పరామర్శించారు. నాయకులు శంకర్ నాయక్, దశరథ్ నాయక్, దేవిలాల్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.